# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 17-05-06, గుమ్మలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన శరీరం ద్వారా మనస్సు పనిచేస్తూ ఉంటుంది. నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని, నేను గొప్పవాడిని ఇటువంటి తలంపులు అన్నీ ఎందుకు వస్తున్నాయి అంటే మనస్సే నేను అనుకోవటం వలన, మనస్సుతో తాదాత్మ్యం పొందటం వలన ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. మనస్సు నీవు కాదు కాని మనస్సే నేను అనే అలవాటు అనేకజన్మల నుండి వస్తోంది, ఇది నిజం కాదు, అది ఒక అలవాటు. జీవుడు కర్మ చేస్తాడు. ఆ కర్మ వాడిని వెంటాడుతున్నంతకాలం శరీరాలు వస్తూఉంటాయి. కర్మవాసనలు శరీరంలో ఉండవు, మనస్సులో ఉంటాయి. కర్మవాసనలలో నుండి జీవుడు బయటపడేవరకు శరీరాలు వస్తూనే ఉంటాయి. ప్రారబ్ధం ప్రకారం దేహయాత్ర జరుగుతూ ఉంటుంది. దేహం ద్వారా జరిగే సంఘటనలతో మనం తాదాత్మ్యం పొందకపోతే మనకు దుఃఖంరాదు, ఇది బాగా గుర్తుపెట్టుకోండి, సాధన అంటే ఇదే. బాహ్యంగా ఒకోసారి మనలను అదృష్టం వెంటాడుతూ ఉంటుంది, ఒకోసారి దురదృష్టం వెంటాడుతూ ఉంటుంది. అదృష్టంతోటి, దురదృష్టంతోటి తాదాత్మ్యం పొందము అనుకోండి, మనస్సును అలా ప్రాక్టీసు చేస్తాము అనుకోండి, కొత్త వాసనలు రావు, పాతవాసనలు అన్నీ రాలిపోతాయి. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. కాని మనలోపలఉన్న భగవంతుడిని చూడటం మనకు ఇష్టం లేదు. గుడిలో ఉన్న దేవుడిని చూడటం అంటే మనకు ఇష్టం ఎందుచేతనంటే గుడిలో ఉన్న దేవుడిని మనస్సు కల్పించింది. మనస్సు కల్పించిన విషయాలు అంటే మనకు ఇష్టం, కాని మనస్సు ఎంత నిజమో ఆ విషయాలు అన్నీ కూడా అంతే నిజం.

లోకంలో ఉన్న భక్తులలో సత్యాన్వేషకులు చాలా తక్కువమంది ఉంటారు. సత్యం మన హృదయంలోనే ఉంది. సత్యాన్ని తెలుసుకొనే వరకూ మనం బంధంలో నుండి, దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి బయటపడలేము. ఇప్పుడు మీకు అన్ని విధాల బాగుంది అనుకోండి ఆ బాగు ఎప్పుడూ నిలబడదు, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. అదృష్టం పోతుంది, దురదృష్టం పోతుంది కాని ఆ టైములో అది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తుంది. ఏ కాలంలో ఏది జరగాలో అది జరిగిపోతుంది, మరణం కూడా అంతే. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే సర్వకారణములకు కారణమైనవాడే ఈశ్వరుడు అన్నారు. మీకు ఏదో దుఃఖం వస్తోంది అనుకోండి దానికి ఏదో కారణం ఉంటుంది. అందరి దుఃఖాలకు ఒకటే కారణం ఉండదు, రకరకాల కారణాల వలన దుఃఖం వస్తుంది. మీ దేహప్రారబ్ధంలో ఏది జరిగినా దానికి కారణం

ఉంటుంది. ఆ కారణం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. మీకు అశాంతి వస్తోంది అనుకోండి దానికి కారణం ఉంటుంది. ఇలా అనేక రకాల కారణాలు ఉంటాయి కాని ఈ కారణాలన్నింటికి ఒక కారణం ఉంది, వాడే ఈశ్వరుడు. సర్వ కారణములకు కారణమైనవాడే ఈశ్వరుడు, వాడికి తెలియకుండా మీకు ఏదీ రాదు, ఇది మీకు అర్థమవుతూ ఉంటే దుఃఖం నెమ్మదిగా నశిస్తుంది. చైతన్యం అంటే మహాసముద్రం లాంటిది. అది లోపల ఉంది, బయట ఉంది, అంతటా ఉంది. మన మనస్సు అనేది ఆ సముద్రంలో నుండి ఒక చెంచాతో నీరు తీసుకోవడం వంటిది. అది కూడా నీరే. కాని మనం దానిని సముద్రంలో కలపలేకపోతున్నాము, సెపరేట్‌గా ఉంచుకోవాలని చూస్తున్నాము. మన మనస్సు కూడా చైతన్యమే, అది సముద్రంలో బుడగలాంటిది. ఆ బుడగ పగిలిపోతే ఏమీ లేదు. ఆ బుడగ మనకు బంగారంలాగ కనిపిస్తోంది. అందుచేత దానిని విడిచిపెట్టలేక పోతున్నాము, అందుచేత మనలను దుఃఖం వెంటాడుతోంది. నామరూపములు అనేవి మబ్బులు. ఆకాశంలో మబ్బులు ఎక్కువగా ఉంటే సూర్యుడు ఎలాగ కనబడడో అలాగే మనం నామరూపములు అనే మబ్బులులో ఉంటే, వాటి చుట్టూ తిరుగుతూ ఉంటే కోటి జన్మలు ఎత్తినా లోపల ఉన్న వస్తువు మనకు దొరకదు, మీరు సాధనలు చేసినా దొరకదు. గానుగెద్దు చుట్టూరు తిరుగుతూ చాలా దూరం వచ్చేసాను అనుకొంటుంది కాని గంతలు విప్పేస్తే అక్కడే ఉంటుంది, మనం చేసే సాధనలు అలాగే ఉన్నాయి. సాధన చేసి వాసనలు తగ్గించుకోవాలి. సాధన చేసి వాసనలు పెంచుకొంటూ ఉంటే నీకు జ్ఞానం ఎలా కలుగుతుంది, ఆత్మసుఖాన్ని ఎలా పొందుతావు. ఆ పని నేను చేసాను, నువ్వు నన్ను గౌరవించాలి అంటారు. అసలు నువ్వు ఎవరు? నేను ఎవరు? అసలు నీకు ఆ పని చేసే శక్తి ఎవరు ఇచ్చారు. ఒకటి గుర్తు పెట్టుకోండి. మీలో ఎవరికయినా తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, ధనం ఉంది అనుకోండి, అధికారం ఉంది అనుకోండి ఇవన్నీ భగవంతుడు యిస్తే మీకు వచ్చాయి కాని, ఇక్కడ మీ సొంతం అంటూ ఏమీ లేదు. భగవంతుడు ఇచ్చినవి మనం సొంతం అనుకొని మనం పాడైపోతున్నాము. భగవంతుడు మనకు ఇచ్చినదే, ఆయనకు ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటూ దేహవాసన పెంచుకొంటున్నాము. ఇంక ఈ జీవుడు దేహాన్ని అంటిపెట్టుకొని ఉంటాడు, కర్మవాసనలు దేహభావనను విడిచిపెట్టనివ్వవు. మనం చేసే కర్మ సత్కర్మ అయి ఉండాలి, అది నిష్కామంగా చేయాలి. కర్మ వాసనలు ఎలా తగ్గుతాయి అంటే మన దేహయాత్రకు సరిపడ పనులు మనం చేసుకొంటూ, మిగతా టైము కొంత స్వార్థం లేకుండా పనులు చేస్తూ ఉంటే నెమ్మదిగా కర్మ వాసనలు తగ్గటం ప్రారంభమవుతాయి. ఏదో గౌరవాలకోసం, స్వార్థం కోసం పనులు చేసి మేము నిష్కామకర్మ చేస్తున్నాము అంటే ప్రజలు నమ్ముతారు కాని దేవుడు

నమ్మడు. నీవు చేసే పనికి, నీవు మాట్లాడే మాటకు కూడా ఆయన సాక్షిగా ఉన్నాడు. అందుచేత మనుష్యయజ్ఞం చెయ్యి. అంటే నీ పొట్టకు సంబంధించినంత వరకు పని చూసుకొని, తోటి మానవులకు వారి అవసరాన్ని బట్టి కొంచెం కూడా స్వార్థం లేకుండా పని చెయ్యి. పని పనికోసమే చెయ్యి అంతేగాని గౌరవం కోసం చెయ్యవద్దు, అది మనుష్య యజ్ఞం. కొంత బ్రహ్మయజ్ఞం చెయ్యి. అంటే నీకు తెలిసిన మంచి మాటను ప్రక్కవాడికి చెప్పు. వాడు ఏదైనా అశాంతిగా ఉన్నాడు అనుకో, ఈ మాట చెపితే వాడికి కొంత శాంతి కలుగుతుంది అనుకో, స్వార్థం లేకుండా వాడికి మంచి మాటలు చెప్పు. పితృయజ్ఞం అంటే పితృదేవతల పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. మన పెద్దవారు ఎంతో కష్టపడితేనే మనం ఇంతటివారము అయ్యాము. వారు చదువు చెప్పిస్తే చదువుకొన్నాము, వారు కట్టిన ఇంటిలో ఉంటాము, వారు సంపాదించి ఇచ్చినది అనుభవిస్తూ ఉంటాము కాని వారిని గౌరవించటం లేదు, వారిని అగౌరవపరుస్తూ ఉంటాము. కనీసం సంవత్సరంలో ఒక్కరోజున అయినా వారు చనిపోయిన రోజు అయినా వారిని జ్ఞాపకం పెట్టుకోము. అందుచేత పితృదేవతలను మనం మర్చిపోకూడదు. మన జీవిత విధానం చెరువులో నీరు లాగ ఉండకూడదు, నదిలో నీరులాగ యజ్ఞభావనతో పనిచేస్తూ అలా ప్రవహిస్తూ ఉండాలి. 18 పురాణాలు వ్రాసిన వ్యాసుడు ఈ పురాణాల సారాన్ని రెండు మాటలలో చెపుతున్నాను అన్నాడు. నాకు ఏది మంచిది అని నేను అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా మంచిదే, నాకు ఏది చెడ్డది అని నేను అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా చెడ్డదే, ఇతరులు నా పట్ల ఎలా ప్రవర్తించాలని నేను అనుకొంటున్నానో నేను కూడా ఇతరుల పట్ల అలా ప్రవర్తించాలి అని చెప్పాడు. కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే అందరూ వారిని గౌరవించాలి అనుకొంటారు వారు మటుకు ఇతరులను అగౌరవంగా చూస్తారు, అది నీచాతి నీచమైన బుద్ధి. ఏ మనిషి అయినా వాడికి సొంత ఆలోచన లేకపోతే, వాడి మీద వాడికి విశ్వాసం లేకపోతే వాడు బాగుపడడు. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అనుకోవటం వలన మీకు అజ్ఞానం పెరుగుతుంది. మీ పని ఏదో మీరు చేసుకోండి, మీ నిదానంలో మీరు ఉండండి. మీరు తరించటం చూసుకోండి. మీరు చనిపోయినప్పుడు మీ కుటుంబ సభ్యులుకాని, స్నేహితులుగాని ఒక్కడు కూడా మీ కూడా రాడు, ఈ జీవుడు ఒంటరి ప్రయాణం చెయ్యవలసి ఉంటుంది. ఇది గుర్తు పెట్టుకోండి.

కృష్ణుడు చివరి రోజులలో ఉద్ధవుడితో నేను నీకు చాలా విషయాలు చెప్పాను కాని సత్‌సాంగత్యం, మహాత్ములు, ఋషులు, యోగుల యొక్క కంపెనీకి మించిన సాధన లేదు ఉద్ధవా ఇంక మనం డిస్‌పర్స్ అయిపోదాము అన్నాడు కృష్ణుడు. ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి

దారి ఏమి చూపిస్తాడు. హృదయాభిముఖంగా ప్రయాణం చేసేవాడి దగ్గర, మహర్షుల దగ్గర ఉన్నప్పుడు వారి సహవాసం వలన వారి వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి. నీవు చేసే సాధన తక్కువ అయినా అత్యంత ఉత్కృష్టమైన ఉదాత్తమైన లాభాన్ని ఈ శరీరంలో ఉండగానే ఇప్పడే పొందుతావు, సత్‌పురుషుల సహవాసానికి మించిన సాధన లేదు ఉద్ధవా అంటాడు. ఏ వస్తువును తాను అనుభవిస్తున్నాడో, ఎంజాయ్ చేస్తున్నాడో వాడితో సహవాసం వలన వాడి వైబ్రేషన్స్ పనిచేసి నీకు తరించే మార్గం కనిపిస్తుంది ఉద్ధవా అంటాడు. రామకృష్ణ పరమహంస ఒక మాట చెప్పారు. ప్రతీ మనిషి నేను నేను అంటాడు. ఏదైతే నువ్వు నేను, నేను అంటున్నావో ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు, ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో చూడండి. ఆచార్యులవారు ఏమనిచెప్పారు అంటే నువ్వు చైతన్యాన్ని మనస్సు అనుకొంటున్నావు, చైతన్యాన్ని దేహం అనుకొంటున్నావు. నువ్వు తాడును పాము అనుకొంటున్నావు. నీవు పాము అనుకొన్నప్పడు కూడా అది తాడే. ఆ తాడే నీకు పాములాగ కనిపిస్తోంది. నీకు తాడు తాడులాగ కనిపించింది అనుకో అసలు పాము లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. తాడు పాముగా కనిపించినంతకాలం నీకు భయం వేస్తుంది. తాడు తాడుగా కనిపించాక ఇంక భయకారణం ఉండదు, అయ్యో తెలియక పోవడంవలన భయపడ్డాను అనుకొంటావు. నువ్వు అనుభవించే దుఃఖం కూడా అటువంటిదే. ఇప్పడు మీరు ఏదైనా దుఃఖం అనుభవిస్తున్నారు అనుకోండి, మీకు జ్ఞానం కలిగింది అనుకోండి అనవసరంగా దుఃఖపడ్డాను, ఇంట్లో వారిని హింసపెట్టాను, నన్ను నేను హింసపెట్టుకొన్నాను అని నీకు అనిపిస్తుంది. మనం నేను నేను అంటాము, అసలు అది లేదు. బంగారం నీలోపలే ఉంది. ఆ బంగారం బంగారంలాగ నీకు కనిపించకపోవటం వలన ఈ నేను కనిపిస్తోంది. లోపల ఉన్న బంగారం బంగారంలాగ నీకు కనిపించినప్పడు అసలు ఈ నేనే లేదు. నీ సాధన అబద్ధం. ఇది ఉంది అనుకోవటం అబద్ధం, పోయింది అనుకోవటం అబద్ధం.

లోకం ఏదో రకంగా ప్రయాణం చేస్తుంది. నేను కూడా అలాగ వెళ్ళిపోతాను అంటే నీకు జ్ఞానం ఏమిటి? వారు అలా ఉంటున్నారు, వీరు ఇలా ఉంటున్నారు అని నీవు కూడా అలాగ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? నువ్వు నువ్వులాగ ఉంటే నీకు జ్ఞానం వస్తుంది కాని ఎవరిలాగో ఉంటే నీకు జ్ఞానం ఎలా వస్తుంది. నీకు రోగ నిర్ధారణ అయిన తరువాత దానికి సంబంధించిన మందులు వాడితే రోగం తగ్గిపోతుంది. అలాగే వాసనలు ఎలా తొలగించుకోవాలో తెలుసుకొన్నాక దానిని ప్రాక్టీసు చేయాలి అంతేగాని అదేపనిగా అధ్యయనం చేయనక్కరలేదు. దుఃఖకారణం కత్తిరింపబడకుండా దుఃఖం నశించదు. అది ఎలా

కత్తిరింపబడాలో నీకు శాస్త్రం చెపుతోంది, దానిని నీవు ప్రాక్టీసు చెయ్యటమే. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి నశించే వరకూ ఏ మనిషినీ దుఃఖం విడిచిపెట్టదు. నేను ఉంటే నువ్వు ఉన్నావు, లోకం ఉంది. నేను లేదని నాకు తెలిసినప్పడు నువ్వు లేవు, లోకం లేదు. ఎవడైనా మీ ఇంటికి సహాయం చేయమని వస్తాడు అనుకోండి, మీరు చేయగలిగితే చేయండి, లేకపోతే లేదు, అంతేగాని నీవు దున్నపోతులాగ ఉన్నావు, నీకు సహాయం ఏమిటి అని ఇటువంటి మాటలు అనవసరం. కొంతమంది మనుషులు పాడైపోవటానికి అనేక రకాల కారణాలు ఉంటాయి. అందుచేత మీకు ఇష్టమైతే చేయండి లేకపోతే పంపేయండి, తిట్టి పంపటం ఎందుకు? ఆ పరిస్థితులలో మనం ఉంటే మనం ఎలాగ ఉంటామో అని మనం ప్రశ్నించుకోవాలి. మనకు రజోగుణం, తమోగుణం, సత్వగుణం ఉన్నాయి. రజోగుణం, తమోగుణం మనకు హృదయంవైపు దారి కనబడనివ్వవు. సత్వగుణం కూడా గుణమే అయినా అది హృదయంవైపుకు దారి చూపించి ప్రక్కకు తప్పకొంటుంది. మనం హృదయం వైపుకు ప్రయాణం చేయాలంటే సాత్వికవాక్కు, సాత్వికకర్మ, సాత్వికబుద్ధి ఉండాలి. మనం ఏదైనా మాట చెపుతూ ఉంటే అది నిర్మలంగా ఉండాలి, ఇతరుల హితవు కోరి చెప్పాలి, వారికి అర్థమయ్యేలాగ చెప్పాలి, వారికి ఆచరించాలనే బుద్ధి కలగాలి మనం మాట చెప్పే పద్ధతి అలాగ ఉండాలి. నువ్వు గుర్తింపులు కోరుకొంటూ కర్మ చేస్తే అది సాత్విక కర్మ కాదు. నీవు చేసే కర్మ నిర్మలంగా ఉండాలి, ఆడంబరం ఉండకూడదు, గుర్తింపులు కోరవద్దు. మీ మాట సాత్వికంగా ఉంటే, మీరు చేసే పని సాత్వికంగా ఉంటే మీకు సాత్వికబుద్ధి వస్తుంది. సత్య సాక్షాత్కారానికి సాత్వికబుద్ధి సహకరిస్తుంది. మీరు ఏ మార్గాన్ని అవలంభించినా జీవలక్షణాల నుండి బయటకు రాకుండా, ప్రకృతి గుణాలనుండి విడుదలపొందకుండా నీకు సత్యసాక్షాత్కారం కలుగదు. ఎవరికీ పెట్టకుండా మనకు ఉన్నది అంతా మనమే తినేస్తున్నాము అనుకోండి, మీరు నెంబర్ వన్ దొంగలు అన్నాడు పరమాత్మ. అదేమిటి మేము కష్టపడుతున్నాము, అందుచేత మేము తినేస్తున్నాము అంటే అయితే మీరు కూలివారు అన్నాడు.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. దానిని కొంతమంది దేహంగా చేస్తున్నారు, కొంతమంది మనస్సుగా చూస్తున్నారు, కొంతమంది ప్రపంచంగా చూస్తున్నారు, దానిని రకరకాలుగా చూస్తున్నారు. అది ఎలాగ ఉందో అలాగ దానిని ఎవరూ దర్శించలేకపోతున్నారు, అదే నీ అశాంతికి కారణం, నీ ఉద్రేకానికి కారణం. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు దర్శనమయితే నీకు భయం లేదు. దుంగ దుంగలాగ కనిపిస్తే నీకు భయంలేదు, దుంగ దుంగలాగ కాకుండా దొంగలాగ కనిపిస్తే నీకు భయం కలుగుతుంది. మనస్సును పెంచుకోవద్దు, మనోనాశనానికి

కృషి చేసుకోండి. మనస్సు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. అందుచేత నీ జీవితవిధానం అంతా మనోనాశనానికి సహకరించాలి. మాయ ఎంత బలీయంగా ఉంటుంది అంటే మీ అమ్మగారి తోటి, నాన్నగారి తోటి మాట్లాడుతున్నారా అని ఈ మధ్యన పాలకొల్లులో ఒకరిని అడిగాను. ప్రస్తుతానికి మాట్లాడటం లేదు, వారికి బుద్ధి వచ్చాక మాట్లాడుతాను అన్నారు. మాయ అంటే ఇదే వీడికి బుద్ధి లేదు, వాళ్ళకి బుద్ధి లేదు అనుకొంటున్నాడు. నేను ఏమని చెప్పాను అంటే పోనీ వారికి బుద్ధి లేదు, మీకు బుద్ధి ఉంది కదా, మీ బుద్ధిని ఉపయోగించి వారికి బుద్ధి వచ్చేటట్లు చేయవచ్చు కదా. బతికి ఉండగా వారికి బుద్ధి రాదు అనుకో, వారు చనిపోయిన తరువాత నీకు చూడాలనిపిస్తుంది అనుకో నువ్వు ఎవరిని చూస్తావు. ఇవన్నీ మనస్సు యొక్క లక్షణాలు. కళ్ళు తెరిస్తే మాయలో పడిపోతానేమో, చెవులతో ఏదైనా మాటలు వింటే మాయలో పడిపోతానేమో, గుమ్మందాటి బయటకువెళితే మాయలో పడిపోతానేమో అని ఇలా అనుకొంటూ ఉంటే ఇంక నువ్వు ఎందుకు పనికి వస్తావు. భగవంతుడు నీకు అవయవాలు ఇచ్చాడు. ఇవన్నీ ఎవడైతే ఇచ్చాడో వాడిని పొందటానికి వీటిని మేగ్జిమమ్ ఉపయోగించుకొని వాడి పాదాల దగ్గరకు చేరుకో. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను వృథా చేసుకోవద్దు. నీకు మాయ కనిపిస్తూ ఉండాలి ఆ మాయలో పడకూడదు. భోగాలు అన్నీ నీకు ఎదురుగుండా ఉండాలి కాని నీకు వాటి మీద ఆకర్షణ కలుగకూడదు అన్నాడు కాళిదాసు. మనకు అన్నీ అందుబాటులో ఉండాలి అయినా మనకు వికారం రాకూడదు అంతేగాని ద్రాక్షపండ్లు అందటం లేదు కాబట్టి పుల్లగా ఉన్నాయి అనుకోకూడదు.

రాగద్వేషాలు లేకుండా చూసుకోండి. మీకు ఇష్టం ఉన్నా, అయిష్టం ఉన్నా కూడా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. అందుచేత ఇష్టం ఎంత ప్రమాదమో అయిష్టం కూడా అంతే ప్రమాదం. రోడ్డు మీద జనం అలా వెళ్ళిపోతున్నారు అనుకోండి, వారి మీద మనకు ఇష్టం ఉండదు, అయిష్టం ఉండదు, అలా మనం ఉండగలగాలి. మీకు ఎక్కడా ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి మీరు పాపం కూడా చెయ్యరు, అసలు చెడ్డ చెయ్యవలసిన పని మీకు లేదు. ఎక్కడైనా ఇష్టం ఉంటే అక్కడ ఉపకారం చేయాలనిపిస్తుంది. ఉపకారం కోసం ఉపకారం చేయటం వేరు. ఇష్టం ఉంది కాబట్టి ఉపకారం చేయటం, అయిష్టం ఉన్నచోట అపకారం చేయటం ఇలా చేయటం వలన పాపం పెరిగిపోతుంది. మనం తొందరగా బాగుపడాలి అంటే వారు అటువంటి వారు, వీరు ఇటువంటి వారు అని తీర్పులు చెప్పటం మానివేయాలి. మా ఆయనే నాకు గురువు అని ఈ మధ్య రాజమండ్రిలో ఒకరు చెప్పారు, ఎందుకు అని నేను అడిగాను. ఇంట్లో గొడవ తప్పించి చుట్టాల గొడవగాని, బయట గొడవలుగాని చెపితే నీకు

పనీపాటు ఏమీలేదా, లోకంలో మనుషులు 90 రకాలుగా ఉంటారు, వారి పద్ధతిలో వారు ఉంటారు, నీ పద్ధతిలో నీవు బతుకు. వారి గొడవ నీకు ఎందుకు అనేవారు. అలా ఒక సంవత్సరానికి ఆయన పద్ధతి అంతా నాకు వచ్చేసింది, ఇంక ఇతరుల గొడవ నాకు లేదు. నా మనస్సులో మార్పు వచ్చింది, మా ఆయనే నాకు గురువు అంది. నీకు కాలక్షేపం అవ్వటం లేదు అనుకో మంచి గ్రంథం చదువుకో అంతేగాని రోడ్డు మీద దుమ్ము ముఖానికి రాసుకోవద్దు. దేహంతో తాదాత్మ్యం పొందే తలంపులోనుండి బయటకు వచ్చేవరకు విషయాలు పీడిస్తాయి, లోకం పీడిస్తుంది, మరణానంతరం లోకాలకు తిరగటం తప్పదు. దేహము నేను అనే మొదటి తలంపు ఉన్నంతకాలం నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, లోకం ఉంది, దేవుడు ఉన్నాడు, పుణ్య పాపాలు ఉన్నాయి, జన్మలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి, అది లేకపోతే ఏదీలేదు, నువ్వు మిగులుతావు, అదే నిర్వాణసుఖం, అప్పడు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే.

మనం వాళ్ళని మాయ చేసాము, వీళ్ళను మాయ చేసాము అనుకొంటాము కాని ఈశ్వరుడు మనల్ని మాయచేస్తాడు. ఈశ్వరుడు ఎంత మాయావో చూడండి. పూర్వం భాస్కరాచార్యుడు అని ఆయన గణితంలో పెద్దవాడు. ఆయనకు జ్యోతిష్కం కూడా వచ్చు. ఆయనకు ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి జాతకం ప్రకారం పెళ్ళి అయిన సంవత్సరం తరువాత భర్త చనిపోతాడు అని ఉంది, అది మార్చేయాలి అనుకొన్నాడు. ఆయన పెళ్ళి ముహూర్తాలు బాగా పెట్టగలడు. ఆయన లెక్కలు కట్టి ముహూర్తం పెట్టాడు. ఆయన లెక్క కరెక్టు అయితే ఆ లగ్నం ప్రకారం భర్తకు చావురాదు. ఆయన తెలివి అంతా ఉపయోగించి అమ్మాయికి వైధవ్యం రాకుండా చూడాలని లెక్కలు కట్టాడు. ఆ లెక్కలు కట్టడంలో పొరపాటు అయ్యి మూడు నిమిషాలు ఆలస్యంగా మూహూర్తం పెట్టాడు. సంవత్సరం తరువాత అమ్మాయికి భర్త చనిపోయాడు. ఏమిటి ఇలా జరిగింది అని, ఎక్కడ తప్పు చేసాము అని మరలా అన్నీ చూస్తే మూడు నిమిషాలు లేటుగా ముహూర్తం పెట్టాము అని అప్పడు ఆయనకు తెలిసింది. ప్రారబ్దంలో ఏది జరగవలసి ఉందో అది జరిగి తీరుతుంది. ఈశ్వరుడు మాయావి. అటువంటి మేధావి చేత తప్పు చేయించాడు. ఈ సృష్టిలో సర్వజ్ఞుడు ఒక్కడే, వాడే ఈశ్వరుడు. ఈశ్వరుడి మీద మనకు గౌరవం ఉండాలి, భక్తి ఉండాలి, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనేటువంటి సజీవమైన విశ్వాసం ఉండాలి. ఇతరులను విమర్శించటం కంటే ఇతరులచేత నువ్వు విమర్శించబడటమే నీ ఆధ్యాత్మికఅభివృద్ధికి మంచిదేమో అన్నాడు వర్డ్సవర్త్. అన్నవాళ్ళు అభివృద్ధిలోనికి రారు, పడ్డవారు అభివృద్ధిలోనికి వస్తారు. మీలో ఎవరైనా అదృష్టవంతులు ఉంటే, మీలో ఎవరికైనా రోజులు బాగా వెళ్ళిపోతూ ఉంటే మంచిదే కాని కాలం తీసుకువచ్చే

అదృష్టం చూసి గర్వపడవద్దు, మీ మొఖంలో అవినయం రానివ్వకండి. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు లేదు, పుట్టుక లేదు, దానికి దేహం అక్కరలేదు. బాహ్యంగా వచ్చే హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా నీ మనస్సును హృదయంలో ఉన్న నిజంమీద నిలబెడితే అప్పుడు అది నీకు ఎరుకలోనికి వస్తుంది. అది మనం నోటితో చెప్పకొన్నంత తేలిక కాదు. దానికి చాలా ధైర్యం ఉండాలి. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అనుకొంటే నువ్వు హృదయగుహలోనికి వెళ్లలేవు. మనం సుఖపడాలంటే ఒక మార్గం చెపుతున్నాను. ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరు ఇది నీజాలము అరుణాచలా. నీవు ఒక్కడివే కాని ఇన్ని రూపాలలో కనిపిస్తున్నావు. ఈ జాలంలో మేము పడ్డాము. మాయ ఆయన చేతిలో ఉంది, మాయ చేతిలో మనం పడ్డాము. అందుచేత ఆయన పాదాలను ఆశ్రయించి ఈ మాయలో నుండి బయటపడాలి. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు అని చాలామంది అనుకొంటున్నారు. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు కాదు. దేవుడి దగ్గర అరటిపండు పెట్టేటప్పడు ఏ భావనతో పెడుతున్నావో, ఎవరికైనా ఇచ్చేటప్పడు కూడా అదే భావనతో ఇవ్వాలి, అలా చేస్తే ప్రతీదీ పూజే, అప్పడు ఉన్నదంతా ఆధ్యాత్మికమే, ఇలా కనుక మనం అర్థం చేసుకొని చేస్తే అంతా పూజే, అప్పడు మీకు మారుమనస్సు కలుగుతుంది, ఈశ్వరుని దయకు పాత్రులవుతారు, మీరు తరిస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-05-06, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మనిషికి సుఖం కావాలి, శాంతి కావాలి. శాంతి ఎక్కడ దొరకదో, సుఖం ఎక్కడ దొరకదో అక్కడ మన ఇంద్రియాలు వెదుకుతూ ఉంటాయి. మనస్సు వెదుకుతూ ఉంటుంది. బేసిక్‌గా మనం చేసే పొరపాటు అది. ప్రపంచంలో సుఖం లేదు, శాంతి లేదు. నిష్ప్రపంచస్థితిని పొందినవాడిని, ప్రకృతిని దాటినవాడిని శాంతి వరిస్తుంది, సుఖం వరిస్తుంది కాని ఎవడైతే ప్రకృతిని అతిక్రమించలేడో వాడికి శాంతి లేదు, సుఖం దొరకదు. మనం పుస్తకం చదివేటప్పడు అంతా అర్థమయిపోయింది అని అనుకొంటాము కాని ఏమీ అర్థమవ్వదు. ఉదాహరణకు ఒక వాక్యం చెపుతాను. అహంభావన ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. మీలో ఈ వాక్యం ఎంతమందికి అర్థమయ్యింది. అహంభావన ఉండటం, దానిని పోగొట్టుకోవటం మాట వదిలివేయండి. అసలు అహంభావన అంటే ఇట్టిది అని తెలియటానికి కొన్ని జన్మలు పడుతుంది. కృష్ణుడు గీతలో చెప్పాడు సాధన చేయనివారి మాట వదిలివేయండి, సాధన ప్రారంభించిన తరువాత కూడా బహుజన్మలు కృషి చేస్తేనే కాని వారికి ఆత్మజ్ఞానం కలుగదు అని పరమాత్మ